క్లుప్తంగా

నేడు తిరుచానూరులో రథసప్తమి

తిరుచానూరు: పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంతో సేవలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు అమ్మవారు హంస, అశ్వ, గరుడ, చిన్నశేష వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు చంద్రప్రభ, గజవాహన సేవలు ఉంటాయి. తిరుచానూరు అమ్మవారి ఆలయం పక్కనున్న సూర్యనారాయణస్వామి ఆలయంలో ఉద యం 6 గంటలకు స్వామి అశ్వవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

30న సర్వసభ్య సమావేశం

తిరుపతి అలిపిరి: ఈ నెల 30న టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి స్థలాలు, కోర్టు సంబంధ విషయాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎర్రావారిపాళెం: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని భాకరాపేట సీఐ తులసీరామ్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

మెకానిక్‌కు రూ.10 వేల సాయం

తిరుపతి : గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి చెందిన మెకానిక్ శ్రీనివాసులు వైద్యం కోసం తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తోటి మెకానిక్‌లకు ఏ సమస్య వచ్చినా ఆదుకునేందుకు అసోసియేషన్ ముందుంటుందని మునిరెడ్డి భరోసా ఇచ్చారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

పాకాల : మండలంలోని పాలినేనివారిపల్లి నాగ లింగేశ్వరి దేవి ఆలయ 12వ వార్షికోత్సవ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, ఇందుమతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రాజశేఖర్ దీక్షితులు, సోమశేఖర్ దీక్షితులు, మణికంఠ దీక్షితులు, రోచనా భరద్వాజ్ దీక్షితులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొని ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

చంద్రగిరి: ఆర్టీసీ బస్సు డ్రైవరు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ముప్పు తప్పింది. ఆర్టీసీ బస్సు శుక్రవారం తిరుపతి నుంచి పుంగనూరు మీదుగా మదనపల్లికి బయలుదేరింది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదా రిలోని కోనంగివారిపల్లి వద్ద బస్సు స్టీరింగ్ లాక్ అయ్యింది. డ్రైవరు సమయస్ఫూర్తితో వ్యవహరించి వేగాన్ని నియంత్రించడంతో రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని పైకి ఎక్కి ఆగిపోయింది. ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని పి.కొత్తకోటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఆర్టీసీ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ప్రొక్లెయిన్ సాయంతో బస్సును పక్కకు తీసి తిరుపతికి తరలించారు.

టీటీడీ ప్రాణదాన పథకానికి 187 మంది ఎంపిక

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో టీటీడీ ప్రాణదాన పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సలకు 187 మంది పేద రోగులను ఎంపిక చేసినట్టు డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ తెలిపారు. డైరెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. అర్హతల ఆధారంగా రోగులను ఎంపిక చేశారు. నెఫ్రాలజీలో 43 మంది, రేడియేషన్ ఆంకాలజీలో 23, న్యూరోసర్జరీలో 26, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో 18, న్యూరాలజీలో 31, మెడిసిన్‌లో 9, సర్జికల్ ఆంకాలజీలో 9, కార్డియో థొరాసిక్‌లో 12, కార్డియాలజీలో 8, మెడికల్ ఆంకాలజీలో ఒకటి, జనరల్ సర్జరీలో 3, న్యూరాలజీలో 3, గైనకాలజీ ఒకటి మొత్తం 187 మందిని ఎంపిక చేశామని వెల్లడించారు.

తిరుపతి గంగమ్మకు విశేషపూజలు

భాకరాపేట : దసరా ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నగొట్టిగల్లులోని తిరుపతి గంగమ్మకు విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు, అభిషేకాలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు.

అన్నదానం



తిరుపతి నగరం అన్నారావు సర్కిల్ వద్ద నున్న ఎస్టీ కాలనీలోని విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం రాత్రి డాక్టర్ కేవీ పవన్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు కేవీ రమణ, సత్యవతి అన్నదానం చేశారు. బుక్స్, పెన్సిళ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాజేష్‌రెడ్డి, బాలు, ఉయ్ ట్రస్టు ఫౌండర్ చైర్మన్ తహసిన్‌షేక్ తదితరులు ఉన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి







అడుగడుగునా నిర్లక్ష్యం

నేడు సెల్‌ఫోన్ మనిషి జీవితంలో నిత్యావసర వస్తువు కంటే కూడా ఎక్కువగా మారిపోయింది. ఒక్క నిమిషం కూడా సెల్‌ఫోన్ చూడకుండా గడపలేని స్థితికి చేరుకున్నారు. నిత్యం వాహనాల రద్దీతో నిండి ఉండే తిరుపతి నగర రోడ్లు, కూడళ్ల వద్ద వాహనాలు వస్తున్న విషయాన్ని కూడా గమనించకుండా కొంతమంది యథేచ్ఛగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, ఇయర్ ఫోన్స్‌ను పెట్టుకుని పాటలు వింటూ నిర్లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడంతోపాటు హెచ్చరికలు జారీ చేస్తున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా ఎవరికి వారు స్వీయ నియంత్రణను పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

శ్రీకృష్ణదేవరాయలకు కాపుల ఘన నివాళి



శ్రీకృష్ణరాయులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బలిజ, కాపు సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణదేవరాయుల జయంతిని శుక్రవారం తిరుపతి బలిజ, కాపు సంఘాల నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్క్ వద్దనున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలిజ జేఏసీ కన్వీనర్ నేత నీలం బాలాజీ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలుకు చిత్తూరు ఉమ్మడి జిల్లాతో పాటు ప్రధానంగా తిరుపతికి ఎంతో అవినాభావ సంబంధముందన్నారు. ఆయన దండయాత్రలో ప్రతి విజయం తర్వాత కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని విలువైన ఆభరణాలు సమర్పించే వారిని తెలిపారు. సుమారు 6 వేల చెరువులు, 5 వేల ఆలయాలు, గోపురాలు కట్టించారని పేర్కొన్నారు. కాపు నాడు జిల్లా అధ్యక్షుడు సరితా నాగరాజు, ఆళ్వార్ మురళి, రమేష్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, రామారావు, కృష్ణయ్య, చెంచుకృష్ణ, చంద్రశేఖర్, కరుణానిధి, పసుపులేటి సురేష్, రవీంద్ర, చిన్నిరాయల్, మునిరత్నం, మధు, మాసికృష్ణమూర్తి, పాండు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు సత్కారం



అధికారులను సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచు

చంద్రగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ప్రశంస పత్రాలు అందుకున్న ఎంపీడీవో రమేష్ బాబు, తహసీల్దార్ శిరీష, ఎంఈఓ లలిత కుమారి, వీఆర్‌ఓ నాగరాజును శుక్రవారం ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచ్ ముదికుప్పం రూప ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలాభివృద్ధిలో అధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు. సీఎం జగనన్న ఆశయ సాధనతో పాటు మండలంలోని అర్హులకు పథకాలను అందించడంలో ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రోత్సాహంతో మరింత మెరుగ్గా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవిచంద్ర, మమత, నాయకులు ప్రకాష్ రెడ్డి, నాగరాజు, ముదికుప్పం రామ్మూర్తి పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో సెల్‌పోన్ వాడకం ప్రమాదకరం



మాట్లాడుతున్న డీఎస్పీ కాటమరాజు

తిరుపతి అలిపిరి: డ్రైవింగ్‌లో సెల్‌పోన్ వాడకం ప్రమాదకరమని తిరుపతి ట్రాఫిక్ విభాగం డీఎస్పీ కాటమరాజు తెలిపారు. అలిపిరి డిపోలో శుక్రవారం భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలకు తావులేకుండా డ్రైవింగ్ చేయాలన్నారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. డ్రైవింగ్ సమయంలో మద్యం జోలికి వెళ్లరాదని స్పష్టం చేశారు. ప్రయాణికులతో గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. డిప్యూటీ సీఎంఈ నరసింహులు, డీఎం ప్రభాకర్, డ్రైవింగ్ స్కూల్ కోఆర్డినేటర్ రాము తదితరులు పాల్గొన్నారు.

టాటా టియాగో ఈవీ ఎలక్ట్రికల్ కారు ఆవిష్కరణ



కస్టమర్‌కు కారు కీ అందజేస్తున్న డీటీవో సీతారామిరెడ్డి, షోరూమ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తనపల్లి రోడ్డు సర్కిల్, మార్కెట్ యార్డ్ వద్దనున్న విజయభారతి షోరూమ్‌లో శుక్రవారం టాటా కంపెనీ సరికొత్త ఎలక్ట్రికల్ కారును ఘనంగా ఆవిష్కరించారు. ఇందులో ముఖ్య అతిథులుగా డీటీవో సీతారామిరెడ్డి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.రవికుమార్, ఇండియన్ బ్యాంక్ డీజీఎం ఎం.అరుణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. డీటీవో సీతారామిరెడ్డి మాట్లాడుతూ టాటా కంపెనీ ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన టియాగో ఈవీ ఎలక్ట్రికల్ కారు కాలుష్య రహిత సమాజానికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. షోరూమ్ అధినేత ఎస్.వెంకటరామణ్ మాట్లాడుతూ టియాగో ఈవీ కారులో ఉన్న లాంగ్ రేంజ్ 24 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ హోమ్ చార్జర్ 315 కిలోమీటర్లకు 3.6 గంటల చార్జింగ్ సమయం తీసుకుంటుందని తెలిపారు. ఆరు గంటల చార్జింగ్‌తో 200 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. డీసీ ఫాస్ట్ చార్జర్ 80 శాతం బ్యాటరీని చార్జ్ చేయడానికి 57 నిమిషాలు పడుతుందని తెలిపారు. 5.7 సెకన్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని చేరుకోవచ్చని తెలిపారు. మోటారు, బ్యాటరీకి 8 ఏళ్ల వారంటీ ఉంటుందని తెలిపారు. అలాగే పలు ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని వివరించారు. ఈ కొత్త కారు ప్రారంభ ధర రూ.8.49 లక్షలన్నారు.

రమాదేవిలో ఆధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు



బాధితులతో వైద్య బృందం

తిరుపతి తుడా : తిరుపతిలోని రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రష్యన్ ఇలిజరోవ్ టెక్నిక్ ద్వారా ఆధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు చేసినట్టు డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రమాదంలో ఎముకలు విరగడం ద్వారా పొట్టిగా మారుతాయన్నారు. పొడవు పెంచేందుకు, కాళ్లను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ఇన్‌ప్లాంటేషన్ ప్రక్రియను చేపడతామన్నారు. ముగ్గురు బాధితులు ఇదే సమస్యతో తమ ఆస్పత్రికి వచ్చారన్నారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా రష్యన్ ఇలిజరోవ్ టెక్నిక్ ద్వారా కాళ్లు సాధారణ స్థితికి తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయినట్టు తెలిపారు. డాక్టర్లు కిషోర్, పవన్ పాల్గొన్నారు.

తిరుమలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



తిరుమల: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. టీటీడీ జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్ ఆయనకు స్వాగతం పలికారు. దర్శనం ఏర్పాట్లు చేశారు. జవహర్ రెడ్డి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

తిరుపతి కల్చరల్: ఎలక్ట్రీషియన్స్‌తో పాటు అనుబంధ వృత్తుల వారి సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ కృషి చేస్తుందని తిరుపతి ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబర్స్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసీ.హరీష్ తెలిపారు. థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి సందర్భంగా శుక్రవారం గంధమనేని శివయ్య భవన్‌లో ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు నందగోపాల్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్, మోటారు మెకానిక్స్, రివైండర్స్‌ను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ్యత్వం కలిగిన వారికి ప్రధాన మంత్రి బీమా పథకం నమోదు చేయిస్తామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అసోసియేషన్ తిరుపతి నగర అధ్యక్షుడు యు.మురగయ్య, ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి జీఏస్‌ఆర్‌సీ.మూర్తి, కోశాధికారి పి.నీలకంఠం, ఉపాధ్యక్షులు శేషాద్రి, వెంకట్రాయులు, రమేష్, సహాయ కార్యదర్శులు శివకుమార్, ప్రదీప్, పార్థసారథి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పాకాల : మండల కేంద్రమైన పాకాలలో శుక్రవారం ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ షబ్బీర్ మాట్లాడుతూ థామస్‌ఆల్వా ఎడిసన్ బల్బును కనుగొన్న రోజును ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకుంటామని తెలిపారు. ఎలక్ట్రీషియన్ల సంక్షేమానికి యూనియన్ ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెబాస్టిన్, గంగాధర్, వెంకటేష్, బాలాజీ, మునికృష్ణ, లోక, బాబు, పురుషోత్తం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 145 రద్దుపై హర్షం

తిరుపతి కల్చరల్: ప్రైవేట్ లేఅవుట్లలో ఐదు శాతం ప్రభుత్వానికి కేటాయించాలంటూ ఇచ్చిన జీఓ 145 ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంపై క్రెడాయి అధ్యక్షుడు టీఎస్.రాజశేఖర్ గుప్త ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జీఓ 145ని రద్దు చేయాలని రాష్ట్రంలోని క్రెడాయి సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సంబంధిత మంత్రి ఆదిమూలం సురేష్, ముఖ్య సలహాదారులకు అనేక సార్లు విజ్ఞప్తి చేసినట్టు పేర్కొన్నారు. స్పందించిన సీఎం జీఓను రద్దు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆదిమూలం సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

15 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం సేవించి వాహనాల్లో తిరుమల వెళుతున్న ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వర రావు శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఎనిమిది మందికి రూ.1,600 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. నిందితులను తిరుమల ట్రాఫిక్, టూటౌన్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

చెత్త సేకరణకు ఆటోలు



చంద్రగిరి: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి పంచాయతీకి సుమారు రూ.9 లక్షల విలువ చేసే బ్యాటరీతో నడిచే ఆటో అందజేయనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తరలించేందుకు ఆటో వెనుక రెండు క్యాబిన్లు ఏర్పాటు చేశారు. వాటిని త్వరలోనే ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

నటి జమునకు ఘన నివాళి



తిరుపతి కల్చరల్: సినీ నటి జమునకు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జమున మాతృభాష కన్నడం అయినా ఎన్నెన్నో విజయవంతమైన చిత్రాలతో తెలుగు వారి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆమె మృతి బాధాకరమని తెలిపారు. రంగస్థలి కార్యదర్శి కేఎన్.రాజా, ఎస్వీ.రామకృష్ణయ్య, తిరుపాలాచారి, రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, వెంకటమునిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల 1976–78వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 24 మంది పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సి.ప్రకాష్‌బాబు, పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎల్ఆర్.మోహన్‌కుమార్‌రెడ్డి, కేఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ ఎన్.శ్రీనాసాద్, కె.శివశంకర్‌బాబు, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పాకాల : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మెరిట్ విద్యార్థులకు శుక్రవారం ఆర్‌కెఎల్ఎస్ ట్రస్ట్ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మందికి రూ.61 వేలు, అలాగే రూ.15 వేలు విలువైన డిక్షనరీలు ఇచ్చారు. ఆర్‌కెఎల్ఎస్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.కోదండయ్య నాయుడు, ట్రస్ట్ సభ్యులు మురళీకృష్ణ, ఆర్.నాగరాజనాయుడు, ప్రిన్సిపాల్ బేబీశ్వర్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోవాలి

తిరుపతి తుడా : వైద్య విద్యార్థులు బాగా చదికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు, జన్మభూమి రుణం తీర్చుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ కోరారు. ఆయన శుక్రవారం వర్చువల్ విధానంలో ఢిల్లీ నుంచి పరీక్షాపేపై చర్చ నిర్వహించారు. ఎస్వీ మెడికల్ కళాశాల భువన విజయం ఆడిటోరియంలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశానికి నిజమైన సేవ చేసినప్పుడే ఉత్తమ వైద్యులుగా ఆవిష్కరించబడతారని, గ్రామీణులకు నిస్వార్థమైన సేవలు అందించినప్పుడు సంపూర్ణ వైద్యులవుతారని పేర్కొన్నారు. పరీక్షల్లో ఆందోళనకు గురికావద్దని చెప్పారు. భయపడితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేమన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

తిరుపతి చేరిన సీపీఐ సమరయాత్ర

తిరుచానూరు: ఎన్నికల సందర్భంగా సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి సాక్షిగా మోదీ, అమిత్‌షా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నిరంకుశ వైఖరితో వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకోసం చేపట్టిన సమర యాత్ర శుక్రవారం తిరుపతి చేరింది. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, రాష్ట్రంలో ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, పెట్రో కెమికల్ యూనివర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి వివాహం ఢిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు. కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

మండల అభివృద్ధే ధ్యేయం

- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు
- రూ.8 కోట్లతో దుర్గసముద్రంలో పనులు
- తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- గడప గడపకూ మన ప్రభుత్వానికి అపూర్వ ఆదరణ



దుర్గసముద్రంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం దుర్గసముద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు అపూర్వస్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సమావేశ మందిరం నిర్మించాలని వడ్డిపల్లికి చెందిన డ్వాక్రా మహిళలు వినతి పత్రం అందజేశారు. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని ఎంపీపీ వారికి హామీ ఇచ్చారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ దుర్గసముద్రం పంచాయతీలో రూ.8 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోనే అత్యధికంగా అభివృద్ధి నిధులను తీసుకున్న పంచాయతీ ఇదేనని, సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి కార్యసాధకుడని అభినందించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కాళ్లు, చేతులు దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్న వడ్డిపల్లికి చెందిన సురేష్‌కు సొంతనిధులతో వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీటీసీ మునిరెడ్డి, చిరంజీవి, శంకరానందరెడ్డి, నాగిరెడ్డి, జ్యోతినాథ్‌రెడ్డి, నాదమునిరెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



పాకాల : ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో 54 అడుగుల సుబ్రమణ్య స్వామి విగ్రహాన్ని నిర్మించేందుకు శుక్రవారం భూమి పూజ చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఆమెకు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నాయకులు నంగా బాబురెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, గౌరీశంకర్‌రాజు, గిరిధర్‌రెడ్డి, సురేష్, మునిరత్నంరెడ్డి, రమేష్, నరసారెడ్డి, అన్నాబాబు తదితరులు పాల్గొన్నారు.